ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 3 జూన్ 2025



రేపటి నుంచి డయల్ యువర్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్

పార్వతీపురం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్యక్రమాన్ని ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్నట్టు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.సాయికృష్ణచైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, యువతకు నైపుణ్య శిక్షణ సమాచారం, ఇతర జీవనోపాధి వివరాలు అందిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ 70753 82163 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వాట్సాప్ ద్వారా కూడా కావాల్సిన సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

57 ఏళ్లుగా.. ఎక్కడికెళ్లినా సైకిల్‌పైనే!



రెడ్డి బాబ్జీ

ఒకటి కాదు.. రెండు కాదు.. గత 57 ఏళ్లుగా సైకిల్ వినియోగిస్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నారు సాలూరుకు చెందిన 70 ఏళ్ల రెడ్డి బాబ్జీ. పట్టణంలోని డబ్బీవీధిలో నివాసం ఉంటున్న ఆయన ఈ వయసులోనూ ఎంతో హుషారుగా సైకిల్ తొక్కుతారు. పది కిలో మీటర్ల లోపు ఎక్కడికైనా వెళ్లాలంటే సైకిల్‌నే వినియోగిస్తున్నారు. పదమూడో ఏటనే ఆఫ్ పెడల్ ద్వారా ఆయన సైకిల్ నేర్చుకున్నారు. ఆ తర్వాత కొన్నాళ్ల వరకు ఆయనకు అదే జీవనాధారంగా మారింది. సాలూరు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కూర్మరాజుపేటలో ఉన్న పొలాలకు సైకిల్ పైనే వెళ్లేవారు. అప్పట్లో అద్దె ప్రాతిపదికన తీసుకుని వినియోగించే వారు. సుమారు 25 ఏళ్ల కిందట సొంతంగా సైకిల్‌ను కొనుగోలు చేసుకున్నారు. దానికే మరమ్మతులూ చేపడుతూ.. ఇప్పటికీ వినియోగిస్తున్నారు. అప్పట్లో నేరేళ్లవలస, తోణాం, దుగ్గేరు సంతలకెళ్లి చీపుర్లు, చింతపండు కొనుగోలు చేసి వాటిని సైకిల్‌పైనే తెచ్చేవారు. సాలూరు నుంచి ఎప్పటికప్పుడు గజపతినగరం, చల్లవానిపేట, పాశలవలస తదితర గ్రామాలకు కూడా వెళ్లేవారు. సైకిల్ తొక్కడం వల్ల తన ఆరోగ్యం బాగుంటుందని బాబ్జీ తెలిపారు. రోజూ క్రమం తప్పకుండా దానిని వినియోగిస్తానని వెల్లడించారు.

- సాలూరు రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి)

నేడు 'ప్రపంచ సైకిల్ దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనాలు.. 2లో



సైకిల్‌పై వస్తున్న రెడ్డి బాబ్జీ

జేఈఈలో మెరిశారు

- అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు
- భరత్‌చంద్రకు ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 21వ ర్యాంకు
- పాలకొండకు చెందిన రసజ్ఞకు 78వ ర్యాంకు

జియ్యమ్మవలస, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ ర్యాంకులతో ప్రతిభ చూపారు. కొమరాడ మండలం గుణానుపురం గ్రామానికి చెందిన పల్ల భరత్‌చంద్ర ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 21వ ర్యాంకు, ఓబీసీలో 2వ ర్యాంకు సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆ విద్యార్థి తండ్రి రామకృష్ణ విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలో ఉన్న మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. తల్లి దమయంతి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం బెలమం గ్రామ పంచా యతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం వారు శ్రీకాకుళంలో నివాసం ఉండగా.. విద్యార్థి మాత్రం హైద రాబాద్‌లో ఉంటున్నాడు. కాగా భరత్‌చంద్ర అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో, 2 నుంచి 5వ తరగతి వరకు గుడివాడలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివాడు. హైదరాబాద్‌లో ఇంటర్ పూర్తి చేశాడు. ఇటీవల జరిగిన ఈఏపీసీఈటీ ఇంజ నీరింగ్ విభాగంలో 99.99 శాతం మార్కులు సాధించి తెలంగాణలో మొదటి ర్యాంకు సాధించాడు. జేఈఈ మెయిన్స్ 2025లో ఆలిండియా 121వ ర్యాంకు, ఆలిండియా ఓబీసీ కోటాలో 17వ ర్యాంకు పొం దాడు. అంతేగాకుండా ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌కు (గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ మూడు సబ్జెక్టుల్లో) కూడా ఎంపిక య్యాడు. ముంబైలోని ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేయాలనే తన లక్ష్యమని భరత్‌చంద్ర తెలిపాడు. కాగా సోమవారం హైదరాబాద్‌లో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను భారీగా ఊరేగించి ఆ ప్రభుత్వం ప్రోత్సహించింది. ఇందులో భరత్‌చంద్ర కూడా ఉండడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.



భరత్‌చంద్ర

ఫలితాల్లో మెరిసిన రసజ్ఞ

పాలకొండ: పట్టణంలోని వడమ కాలనీకి చెందిన కొరికాన రసజ్ఞ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 78 ర్యాంకు సాధించింది. ఓబీసీ కేటగిరీ నుంచి 8వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. పదో తరగతి వరకు గుడివాడలోచదివి 585 సాధించింది. ఇంటర్ విజయవాడలోని చదివి 983 మార్కు సాధించింది. జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా 422వ ర్యాంకు పొందింది. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్ చదవడమే తన లక్ష్యమని రసజ్ఞ తెలిపింది. విద్యార్థిని ఉత్తమ ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు శ్రీనివాసరావు, రమణమ్మలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తండ్రి చిరు వ్యాపారి కాగా, తల్లి రమణమ్మ స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తున్నారు.



రసజ్ఞకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

ప్రతిభ కనబర్చిన చాణక్య



చాణక్య

గరుగుబిల్లి: గొట్టివలసకు చెందిన బోను చాణక్య జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరీలో 550, ఓబీసీ విభాగంలో 78వ ర్యాంకు సాధించాడు. మొత్తంగా 360 మార్కులకుగాను 232 మార్కులు సాధించాడు. గుడివాడలో టెన్త్ పూర్తి చేసిన చాణక్య 587 మార్కులు దక్కించుకున్నాడు. హైదరాబాద్‌లో ఇంటర్ చదివిన ఆ విద్యార్థి 976 మార్కులు సాధించాడు. చాణక్య తండ్రి శంకరరావు బలిజిపేట మండలం పెదపెంకిలో ఎస్‌జీటీ టీచర్‌గా పని చేస్తున్నారు. తల్లి ప్రియాంక గృహిణి. ఐఐటీలో సీటు సాధించడం ఆనందంగా ఉందని, ఇంజనీరింగ్ (మిగతా 4వ పేజీలో...)

పర్యావరణ పరిరక్షణకు కృషి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



క్లాత్ బ్యాగ్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్‌లో క్లాత్ బాగ్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. పర్యావరణం, జీవులకు హాని కలిగించే దాని నుంచి జిల్లాకు విముక్తి కల్పించాలని పిలుపునిచ్చారు. గురువారం నిర్వహించే 'వనం-మనం' కార్యక్రమంలో అందరూ భాగస్వాములవ్వాలని కోరారు. జిల్లాలో ఐదు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మండల ప్రత్యేకాధికారులు, అన్ని శాఖల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శోభిక, డీఆర్వో కె.హేమలత, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. ఏనుగులు

- తులసిరామినాయుడువలసలో సంచారం
- భయాందోళనలో గ్రామస్థులు, రైతులు

2లో

బాధితులకు న్యాయం చేయాలి

- ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు
- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం

4లో

కలగా మక్కువ ప్రధాన రోడ్డు నిర్మాణం

- వైసీపీ సర్కారు నిర్లక్ష్యం వల్ల వెనక్కి వెళ్లిపోయిన నిధులు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు

అంగన్‌వాడీ కేంద్రానికి రూ.లక్ష

- మినీ కేంద్రాలు ఇక మెయిన్ సెంటర్లు
- మంత్రి సంధ్యారాణి



4లో

అయోధ్యకు పాలకొండ నృత్య కళాకారిణులు

2లో

నిధులు మంజూరై ఏడాది.. నిర్మాణమెప్పుడో మరి!

- నేటికీ ప్రారంభం కాని నీటిపారుదలశాఖ సబ్ డివిజన్ భవనం పనులు
- కొద్దిరోజుల కిందట గోతులు తవ్వి వదిలేసిన వైనం
- ముందుకు రాని కాంట్రాక్టర్
- శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు

పాలకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పాలకొండలో నీటిపారుదలశాఖ సబ్ డివిజన్ భవన నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా.. ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. మరోవైపు బ్రిటీష్ కాలం నాటి శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. భారీ వర్షాలు కురిస్తే.. ఏక్షణాన భవనం కూలిపోతుందో తెలియని పరిస్థితి. దీంతో సంబంధిత ఉద్యోగులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. వాస్తవంగా తోటపల్లి కాలువల ఆధునికీకరణలో భాగంగా శ్రీకాకుళం ఈఈ కార్యాలయంతో పాటు పాలకొండ సబ్ డివిజన్ కార్యాలయ నిర్మాణానికి రూ.మూడు కోట్లు కేటాయించారు. ఇప్పటికే శ్రీకాకుళంలోని ఈఈ కార్యాలయ భవనాన్ని 1.70 కోట్లతో పూర్తి చేశారు. సుమారు రూ.కోటి అందుబాటులో ఉన్నప్పటికీ పాలకొండ సబ్ డివిజన్ కార్యాలయం భవన నిర్మాణం మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



వెలగవాడ సమీపంలో గోతులు తవ్వి పనులు ప్రారంభించని దృశ్యం



శిథిలావస్థలో ఉన్న నీటిపారుదలశాఖ సబ్ డివిజన్ కార్యాలయం

నెల రోజుల కిందటే గోతులు తవ్వి...

వెలగవాడ సమీపంలో భవన నిర్మాణం కోసం నెల రోజుల కిందటే గోతులు తవ్వారు. అయితే ఇప్పటికీ పిల్లర్స్ పనులు ప్రారంభం కాలేదు. భవన నిర్మాణం ఏ ప్రాంతంలో నిర్మించాలన్న దానిపై అధికారుల మధ్య స్పష్టత లేకపోవడం, కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో పనులు మరింత ఆలస్యం కానున్నట్టు స్పష్టంగా తెలుస్తుంది.

ఇదీ పరిస్థితి..

- ప్రస్తుతం ఉన్న నీటిపారుదలశాఖ కార్యాలయం 50 సెంట్లలో ఉంది. పట్టణానికి నడిబొడ్డున ఉన్న ఈ కార్యాలయ ప్రాంగణంలోనే భవన నిర్మాణం చేపట్టాలని 2018లోనే ప్రతిపాదన పంపారు. కార్యాలయ ప్రాంగణం కొంతమేర ఆక్రమణకు గురవగా, వాటిని తొలగించి నూతన భవనంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని అధికారులు భావించారు. అయితే పట్టణం గుండా కార్యాలయానికి నిర్మాణ సామగ్రి తరలించడం కష్టసాధ్యమని.. వెలగవాడ సమీపంలో ఉన్న పూర్వపు లస్కర్స్ క్వార్టర్స్ స్థలంలో భవనం నిర్మించాలనుకున్నారు. ఈ మేరకు ఏడాది కిందటే ఓ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారు. అయితే ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు.
- వెలగవాడ సమీపంలో భవనం నిర్మించనున్న స్థలంపై రైతు సంఘం (మిగతా 4వ పేజీలో...)

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ



పార్వతీపురంలో యోగా చేస్తున్న అధికారులు

పార్వతీపురం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. సోమవారం ఐటీడీఏ కార్యాయల ప్రాంగణంలో యోగాంధ్ర నిర్వహించారు. అధికారులు, మహిళలు, యువత పెద్దఎత్తున పాల్గొని వివిధ ఆసనాలు వేశారు. ఈ నెల 20 వరకు యోగా శిక్షణతరగతులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి పీవో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎ.మురళీధర్, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, గిరిజన సంక్షేమాధికారి కృష్ణవేణి, జిల్లా పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ రఘు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి: సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

సీతంపేట రూరల్: యోగాంధ్ర మాసోత్సవాలను విజయవంతం చేయాలని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం లైన్ డిపార్ట్ మెంట్ అధికారులకు యోగా కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. ఐటీడీఏ పరిధిలో ఈనెల 5న నిర్వహించనున్న యోగాంధ్రను విజయవంతం చేయాలన్నారు. ఉపాధి, వెలుగు, ఐసీడీఎస్, హార్టికల్చర్, ట్రాన్స్‌కో, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సచివాలయ సిబ్బంది కూడా పాల్గొనాలని ఆదేశించారు. పెద్ద ఎత్తున జనాలు తరలి రావాలన్నారు. ఇదిలా ఉండగా సోమవారం నిర్వహించిన యోగ కార్యక్రమానికి అధికారులతో పాటు వారి సిబ్బంది పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంపై పీవో అసహనం వ్యక్తం చేశారు. యోగాకు రాని సచివాలయ సిబ్బందికి మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో మిశ్రోను ఆదేశించారు.

ఘనంగా తొలేళ్లు

- భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు పూజలు
- ఆలయాలకు భక్తుల తాకిడి
- కిటకిటలాడిన పార్వతీపురం
- నేడు సిరిమానోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి

2లో



ఏర్పాట్లపై ఉత్సవ కమిటీలు, పోలీసులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

దశాబ్దాల అనుబంధం



సైకిల్ సవారీ ఆనందంతో పాటు ఆరోగ్యమూ ఇస్తుంది. ఒకప్పుడు ఇంట్లో సైకిల్ ఇంట్లో ఉందంటే అదో దర్పం.. గౌరవం. ఎంత దూరమైనా అదే ప్రయాణ సాధనం. రానురాను టెక్నాలజీ పెరిగింది. ఇప్పుడు ప్రతి ఇంటా ఒకటి లేదా రెండు బైక్‌లు ఉంటున్నాయి. కారు కూడా నిత్యావసరమై పోయింది. రానురాను సైకిళ్లు కనుమరుగై పోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సైకిల్‌ను తొక్కుతున్న వారూ అక్కడక్కడా కనిపిస్తున్నారు. ముప్పై, నలభై, యాభై ఏళ్లుగా దాన్నే వినియోగిస్తున్నారు. దశాబ్దాలుగా తమవద్దే అంటిపెట్టుకుని అపురూపంగా చూసుకుంటున్నారు. వారంతా ఎలాంటి జబ్బులు లేకుండా ఆరోగ్యంగా జీవిస్తున్నారు. గతంలో సైకిల్ అవసరం కాగా.. ఇప్పుడు ఆరోగ్య సాధనంగా కూడా మారింది. మంగళవారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- ఎక్కడికి వెళ్లాలన్నా సైకిల్ మీదే..
- ఇప్పటికీ వినియోగిస్తున్న వృద్ధులు
- 50 సంవత్సరాల కిందటిది ఇప్పటికీ..
- అత్తోరు ఇచ్చిన వాహనం గురుతుగా..
- అప్పటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ..
- సైక్లింగ్‌తో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవం

రాజాం, జూన్ 2(ఆంధ్రజ్యోతి):

ఒకప్పుడు ప్రయాణ అవసరమైన సైకిల్.. ఇప్పుడు ఆరోగ్య సాధనంగా మారింది. దశాబ్దాలుగా సైకిల్ తొక్కుతున్న వారు ఇప్పటికీ పండంటి ఆరోగ్యంతో ఉన్నారు. కానీ సైకిల్ వినియోగిస్తున్న వారి సంఖ్య మాత్రం బాగా తగ్గింది. గతంలో సైకిల్ విక్రయించే షాపులు రాజాం వంటి పట్టణంలో పది వరకూ ఉండేవి. కానీ వాటి సంఖ్య 5కు పడిపోయింది. జిల్లా కేంద్రం విజయనగరంతో పాటు అన్ని పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి. అయితే పిల్లలు, విద్యార్థులు సైకిళ్ల వాడుతున్నందునే సైకిళ్ల విక్రయదారులు, మెకానిక్‌లు ఆ రంగంలో కొనసాగుతున్నారు. మరోవైపు సైకిళ్లతో పాటు వాటి స్పేర్‌పార్ట్స్ ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. ఒకప్పుడు రూ.3 వేలు పడితే మంచి సైకిల్ వచ్చేది. కానీ ఇప్పుడు రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు పెట్టాలి. సైకిల్ వినియోగంతో పర్యావరణానికి మేలు చేయవచ్చు. పెట్రోల్ వినియోగం తగ్గి ఖర్చు ఆదా అవుతుంది. కాలుష్యం సైతం నియంత్రణలోకి వస్తుంది. రోజులో చిన్నచిన్న పనులకు సైకిల్‌ను వినియోగిస్తే నెలలో లీటరు పెట్రోల్‌ను ఆదా చేయవచ్చు. ఆరోగ్యాన్నీ కాపాడుకోవచ్చు. రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని కార్యాలయాలు, మార్కెట్లకు సైకిల్‌ను వినియోగిస్తే చాలా మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు.

అన్ని రుగ్మతలకు మందు..

సైకిల్ తొక్కేవారు మానసికంగా, శారీరకంగా చాలా దృఢంగా ఉంటారు. గంటపాటు సైకిల్ తొక్కితే 780 కేలరీలు ఖర్చవుతాయి. ప్రత్యేకించి స్థూలకాయులు, వృద్ధులు, ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నవారికి సైక్లింగ్ ఉత్తమం. అనేక రకాల రుగ్మతలకు సైక్లింగ్ తారకమంత్రం. అందుకే ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలకు సైకిల్ నేర్పించాలి. రోజుకు ఒక కిలోమీటరు అయినా వారితో తొక్కించాలి.

-డాక్టర్ బంజేటి కోటీశ్వరరావు, రాజాం

49 ఏళ్ల కిందటి సైకిల్ ఇది..



రాజాం పట్టణానికి చెందిన ఈయన పేరు యండమూరి మాధవరావు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈయన వయసు 65 సంవత్సరాలు కాగా.. 49 సంవత్సరాల కిందట సైకిల్ కొనుగోలు చేశాడు. ఇప్పటికీ అదే సైకిల్‌ను వినియోగిస్తున్నాడు. రోజూ సైకిల్‌పై రాకపోకలు సాగిస్తానని.. ఆరోగ్యానికి చాలా బాగుంటుందని చెబుతున్నాడు. అప్పట్లో ఈ సైకిల్ రూ.700కు కొనుగోలు చేసినట్టు చెబుతున్నాడు. మరమ్మతులు చేయించుకుంటూ దీన్నే వాడుతున్నానని, ఈ సైకిల్‌తో తనకు ఎంతో అనుబంధం ఉందని అంటున్నాడు.

60 ఏళ్లుగా ప్రయాణం



ఈయన పేరు గులివిందల ఆదినారాయణ. సాధారణ రైతు. వయసు 75 సంవత్సరాలు. గత 60 సంవత్సరాలుగా సైకిల్ తొక్కుతున్నాడు. ఇప్పటివరకూ ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. తాను సైకిల్ తొక్కడం ప్రారంభించినప్పుడు దాని ధర రూ.300 ఉండేదని చెబుతున్నాడు. ప్రస్తుతం అదే సైకిల్ రూ.7వేలు పలుకుతుంది. రోజుకు 10 నుంచి 20 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం చేస్తానంటున్నాడు.

42 ఏళ్లుగా సైకిల్ మీదనే..

రాజాం పట్టణానికి చెందిన దొంతంశెట్టి ఈశ్వరరావు. దినసరి కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఈయన వయసు 65 సంవత్సరాలు. గత 42 సంవత్సరాలుగా సైకిల్ తొక్కుతున్నాడు. రోజూ సైకిల్ తొక్కడం వల్ల ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నానని చెబుతున్నాడు.



45 ఏళ్లుగా సైకిల్ మీదనే..




రాజాం పట్టణానికి చెందిన ఈయన పేరు కింతలి నాగేశ్వరరావు. ఈయన వయసు 70 సంవత్సరాలు కాగా..45 ఏళ్లుగా సైకిల్ మీదే తిరుగుతున్నాడు. ఇంట్లో పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఉన్నా.. ఈయన మాత్రం పట్టణంలో ఎక్కడికి వెళ్లాలన్నా సైకిల్ మీదనే. రోజుకు 10 నుంచి 20 కిలోమీటర్ల మేర సైకిల్‌పై ప్రయాణిస్తున్నట్టు నాగేశ్వరరావు చెబుతున్నాడు.

30 ఏళ్ల నాటి సైకిల్ ఇది



గరివిడి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణానికి చెందిన మహరాజా సింధుజా అనే వృద్ధుడు చిన్నప్పటి నుంచి సైకిల్ మీదే ప్రయాణం చేస్తున్నాడు. బీహార్‌కు చెందిన ఇతను వ్యాపార రిత్యా గరివిడిలో స్థిరపడ్డాడు. ప్రస్తుతం పాల వ్యాపారం చేస్తున్నాడు. తనకు ఉన్న కొద్దిపాటి ఆవులతో పాలను సైకిల్‌మీదే తిరుగుతూ ఖాతాదారులకు వేస్తుంటాడు. 30 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన సైకిల్‌నే ఇప్పటికీ వాడుతున్నాడు. రోజూ 20 కిలోమీటర్లు సైకిల్ తొక్కుతానని, ఆరోగ్యంగా ఉండడంతోపాటు పైసా కూడా మదుపు ఉండదని చెబుతున్నాడు.

1977లో ఇది అత్తోరు ఇచ్చిన సైకిల్..



బొబ్బిలి రూరల్: బొబ్బిలి మున్సిపాలిటీ తారక రామ కాలనీకి చెందిన రెడ్డి శివున్నాయుడు (74) వివాహం 1977లో జరిగింది. తమకు కట్నం కింద అత్తవారు సైకిల్ ఇచ్చారని, ఆ సైకిల్‌ని ఇప్పటికీ జాగ్రత్తగా వాడుతున్నానని శివున్నా యుడు చెబుతున్నారు. తాను జ్యూట్ మిల్లులో పని చేసే వాడనని, ఉద్యోగానికి సైకిల్ మీదే వెళ్లేవాడని అంటున్నారు. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉన్నానని, ఇప్పటికీ 50 కి.మీ దూరం వరకు సైకిల్ మీదే వెళ్తానని చెబుతున్నారు. సైక్లింగ్ వలన నాకు ఇంత వయసు వచ్చినా ఇంతవరకు కీళ్ల, మోకాళ్ల నొప్పులు ఏవీ లేవన్నారు.

వైకల్యాన్ని జయించి..



బొబ్బిలి మండలం మల్లంపేట గ్రామానికి చెందిన మొరక గౌరిశంకర రావు వయసు 70ఏళ్లు. ఈయనకు పుట్టుకతోనే వైకల్యం. ఓ కాలు సగం వరకు లేదు. కానీ ఆయన ఎప్పుడూ డీలా పడిపోలేదు. ఒంటి కాలితోనే సైకిల్‌ను తొక్కేస్తారు. సైకిళ్లకు మరమ్మ తులూ చేస్తారు. 30 సంవత్సరాలుగా హెర్క్యులస్ సైకిల్ వాడుతున్నారు. సైకిల్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఇంటికి, దుకాణానికి 5 కి.మీలు సైకిల్ మీదే తిరు గుతుంటారు. ఆయన వద్ద సైకిల్ బాగుచేయించుకున్న నాటి విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వారు ఇటువైపు వచ్చినప్పుడు ఆప్యాయంగా పలకరిస్తుంటే ఆయన పొంగిపోతారు.

అప్పట్లో కొత్త సైకిల్ రూ.150..



పాలకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తాను 12 ఏళ్ల వయస్సులో సైకిల్ నేర్చుకుని తిరుగుతున్నానని చెబుతున్నారు పాలకొండకు చెందిన దుర్గారావు. ప్రస్తుతం ఈయన వయసు 73 ఏళ్లు. ఇప్పటికీ తెల్లారి 4కే లేచి సైకిల్ మీద తిరుగుతూ దినపత్రికలు పంచుతారు. నిరంతరం సైకిల్‌తో ప్రయాణం సాగించడం వల్ల ఆరోగ్యవంతంగా జీవిస్తున్నానని చెబుతన్నారు. అప్పట్లో 150 రూపాయలు పెడితే కొత్త సైకిల్ వచ్చేదని, అయితే ఆ స్థోమతలేక సెకెండ్ హ్యాండ్ సైకిల్‌ను రూ.70 పెట్టి కొనుగోలు చేసినట్లు చెప్పా రు. ఆ రోజుల్లో అట్లాస్ వంటి సైకిల్ మాత్రమే ఉండేదం టున్నారు. ఇప్పుడు సైకిల్ తొక్కేవారే కరువయ్యారని, అం దుకే జబ్బులు కూడా అధికమయ్యాయని చెబుతున్నారు.


సైకిలును తొక్కడు.. నడిపిస్తాడు



కురుపాం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కురుపాంకు చెందిన గొల్లపల్లి లక్ష్మం రెవెన్యూ శాఖలో అటెండరుగా పనిచేసి 2009 సంవత్సరంలో పదవీ విరమణ చేశారు. ఆయన 1986లో హెర్క్యులస్ సెకండ్‌హ్యాండ్ సైకిల్‌ను రూ. 300లకు కొనుగోలు చేశారు. ఆఫీసుతో పాటు ఇతర పనుల మీద ఎక్కడికి వెళ్లాలన్నా సైకిలుపై వెళ్లేవారు. తన పిల్లలను స్కూ ళ్లకు, ట్యూషన్లకు దిగబెట్టేందుకు కూడా సైకిల్‌నే వినియోగించేవాడినని, 41 సంవత్స రాలుగా సైకిలు తనకు తోడుగా ఉందని లక్ష్మం చెబుతున్నారు. 2018లో సైకిలు తొక్కుతుండగా కిందపడి ఈయన కుడికాలు ఫ్రాక్చర్ అయింది. ఆరోజు నుంచి సైకిలు తొక్కడం మానేశారు. కానీ ఎక్కడికి వెళ్లినా ఊతం కోసం సైకిలును ఉపయోగిస్తున్నారు. చేతి కర్ర సాయంతో నడిస్తే ప్రజలు పక్కకు తప్పుకోరని, బ్యాలన్సు కూడా తక్కువని, అందుకే సైకిల్ ఊతంగా పట్టుకుని వెళ్తున్నానని లక్ష్మం చెబుతున్నారు.

అమ్మో.. ఏనుగులు

- తులసిరామినాయుడువలసలో సంచారం



తులసిరామినాయుడువలసలో సంచరిస్తున్న గజరాజుల గుంపు

గరుగుబిల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం మరుపెంట పంచాయతీ తులసిరామి నాయుడువలసలో గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. గత రెండు రోజులుగా గొట్టివలస, దళాయివలస గ్రామాల్లో సంచరించిన ఏనుగులు సోమవారం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న తులసిరామినాయుడువలసకు చేరుకున్నాయి. దీంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. అవి ఏ నిమిషంలో గ్రామలవైపు వస్తాయోనని బెంబేలెత్తిపోయారు. అటవీ శాఖ సిబ్బంది, ట్రాకర్లు ఏనుగుల సంచారాన్ని పర్యవేక్షిస్తున్నారు. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడరాదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.



తొలేళ్లు సందర్భంగా అమ్మవారి ఘటాలకు పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా తొలేళ్లు

- భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు పూజలు
- ఆలయాలకు భక్తుల తాకిడి
- కిటకిటలాడిన పార్వతీపురం
- నేడు సిరిమానోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి

పార్వతీపురం టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణం, జగన్నాథపురం, బెలగాం ప్రజల ఇలవేల్పులు ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మల తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం మేళాతాళాలతో ఉత్సవ నిర్వాహకులు వేమకోటి వీధికి వెళ్లారు. సిరిమానును ముందుండి నడిపించే ఎజ్జి నాగరాజును ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఇప్పలపోలమ్మ ఆలయం వద్ద ఆయన ప్రత్యేక పూజలు చేసి రైతులకు ధాన్యం పంచారు. మరోవైపు రైతులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఇప్పలపోలమ్మకు పూలంగి సేవతో పాటు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సారికివీధి, రెడ్డివీధి, నాయుడువీధి, బొగ్గుల వీధి, తదితర వీధుల్లోని రైతులు పెద్దఎత్తున తొలేళ్ల ఉత్సవంలో పాల్గొన్నారు. దీంతో ఆ ప్రాంతమంతా జైజై ఇప్పల పోలమ్మ అనే నామస్మరణతో మార్మోగింది. ఇక యర్రకంచమ్మ ఆలయంలో అమ్మవారికి రాగోలు, వలిరెడ్డి కుటుంబాలకు చెందిన ఎజ్జిలు ప్రత్యేక పూజలు చేశారు. మొత్తంగా మున్సిపల్, విద్యుత్, పోలీసు శాఖాధికారులు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో తొలేళ్ల ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు.

తరలివచ్చిన భక్తజనం..

ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మలతో పాటు బంగారమ్మలను దర్శించుకోనేందుకు భక్తులు తరలివచ్చారు. ఉదయం 5 గంటల నుంచే ఆయా ఆలయాల బయట భక్తులు బారులుదీరారు. నాయుడు వీధిలోని ఇప్పలపోలమ్మ, జగన్నాథపురంలోని యర్రకంచమ్మ, బెలగాంలోని బంగారమ్మ ఆలయాల్లో భక్తులు అమ్మవార్లకు పసుపు, కుంకుమలను సమర్పించారు. అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. బెలగాం ప్రజల ఇలవేల్పు బంగారమ్మ తల్లి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి 6 గంటల మధ్య అమ్మవారికి మహిళలు ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. మంగళవారం సాయంత్రం అమ్మవారి ఘటాలను బూరాడ వీధిలోని ఆలయం నుంచి నాయుడువీధి, మైదానం వీధి, కోవెల వీధి, అగురువీధి, మద్దెల వీధి, గెడ్డవీధి, కాలేటి వారి వీధి, అగ్రహారం వీధి, చర్చివీధిల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం నాయుడు వీధి రామాలయం వద్ద ఘటాలను దించుతారు. ఆ తర్వాత అనుపోత్సవం నిర్వహిస్తారు.

సిరిమానోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..

పట్టణంలో మంగళవారం నిర్వహించే సిరిమాను ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ సిరిమానులు తిరిగే ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఎదరవకుండా మున్సిపల్, ఉత్సవ కమిటీ సభ్యులు యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. మరోవైపు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంటకటేశ్వర్లు సోమవారం ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవ కమిటీలతో పాటు పోలీసులతో మాట్లాడారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని సూచించారు.



యర్రకంచమ్మ సిరిమాను సిద్ధం చేస్తున్న దృశ్యం

ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్

విజయనగరం దాసన్నపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో తొలి విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టి.వి.గిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడంతో పాటు ధ్రువపత్రా ల పరిశీలన చేసుకున్న అభ్యర్థులకు మెరిట్ జాబితా ప్రకారం కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు వారి పదో తరగతి జీపీఏ మార్కులు ఆధారంగా కేటాయించిన ర్యాంకుల ఆధారంగా వారికి కేటాయించిన తేదీల్లో ఒరిజనల్ ధ్రువపత్రాలతో కౌన్సిలింగ్‌నకు హాజరు కావాలని కోరారు. జూన్ 5న ఉదయం 9 గంటలకు 1 నుంచి 104 ర్యాంకు- జీపీఏ 10 నుంచి 8.2 వరకు.. మధ్యాహ్నం 2 గంటలకు 105 నుంచి 251- జీపీఏ 8.0 నుంచి 7.0 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. 6న ఉదయం 9 గంటలకు 252 నుంచి 450- జీపీఏ 6.8 నుంచి 5.5 వరకు.. మధ్యాహ్నం 2 గంటలకు 451 నుంచి 659, జీపీఏ 5.3 నుంచి దిగువ స్థాయి వారికి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. 10న ఉదయం 9 గంటలకు జనరల్ ఆల్ కేటగీరీలు.. 1 నుంచి 659 ర్యాంకుల వరకూ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అభ్యర్థుల మొబైల్ నెంబర్లకు వారి ర్యాంకు, హాజరు కావల్సిన కౌన్సెలింగ్ తేదీలను మేసేజ్‌ల ద్వారా తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

అయోధ్యకు పాలకొండ నృత్య కళాకారిణులు



అయోధ్యకు బయలుదేరి వెళ్తున్న నృత్యకారిణులు

పాలకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో పాలకొండకు చెందిన నృత్యకళాకారిణులు ప్రదర్శన ఇవ్వనున్నట్టు డ్యాన్స్ టీచర్ నివేదిత తెలిపారు.ఈ మేరకు పట్టణంలోని భారతీయ సంస్కృతి నృత్య శిక్షణాలయంలో శిక్షణ పొందిన 40 మంది నృత్యకారిణులు అయోధ్యలోని బాలరాముని సన్నిధిలో సహస్ర కోటి గోవింద నామస్తూప నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి సోమవారం బయలుదేరి వెళ్లారు. వీరికి డ్యాన్స్ టీచర్ ఛాయా నివేదిత శిక్షణ ఇచ్చారు.

పీజీఆర్ఎస్‌కు 143 వినతులు



విజయనగరం కలెక్టరేట్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 143 వినతులు వచ్చాయి. వీటిని కలెక్టరు అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్, డీఆర్‌వో మురళి, డిప్యూటీ కలెక్టర్లు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 65, డీఆర్‌డీఏ 14, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు 7, పాఠశాల విద్య 5, ఆసుపత్రి సేవలు 4, ఇతర శాఖలు 35 వినతులు అందాయి. వీటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు.



యోగాతో మానసిక ఉల్లాసం

- ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు

సీతంపేట రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని సీతంపేట ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు తెలిపారు. సోమవారం ఉదయం ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌కు ఎదురుగా ఉన్న పాలకొండ- హడ్డుబంగి ప్రధాన రహదారిపై యోగాంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆసనాలు వేశారు. సూర్య నమస్కారాలు కూడా చేసి.. అందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీడీ అన్నదొర, ఎంపీడీవో మిశ్రో, టీడబ్ల్యూఈఈ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

యోగసనాలలో భాగంగా సూర్య నమస్కారం చేస్తున్న ఐటీడీఏ అధికారులు

ప్రచార ఆర్భాటమే..

- లక్ష్యానికి దూరంగా చెత్త సంపద కేంద్రాలు
- నిర్వహణను గాలికొదిలేసిన పంచాయతీ పాలకులు

సంతకవిటి, జూన్2 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల స్వచ్ఛతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఈ కార్యక్రమం ప్రచార ఆర్భాటంగా మిగిలిపోయింది. ఇందుకు సంతకవిటి మండలంలోని పలు గ్రామాలు శుభ్రతకు దూరంగా ఉన్నాయి. చెత్త సేకరణలో జాప్యం నెలకొంటోంది. మండలంలో 34 పంచాయతీల్లో మండవకురిటి, తాలాడ, కృష్ణంవలస, జి.ఎస్.పురం, గోళ్లవలస, గోవిందపురం, జావాం, కాకరాపల్లి తదితర 15 పంచాయతీలలో చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్మాణం చేపట్టారు. గరికపాడు, జి.ఎస్.పురం, రామారాయిపురం పంచాయతీల్లో చెత్త నుంచి


మండవకురిటిలో చెత్త సంపద కేంద్రం ఇలా..

సంపద కేంద్రాలు మధ్యలోనే పనులు నిలిపేశారు. మందరాడ, చిన్నయ్యపేట, చిత్తారపురం, హొంజరాం, సిరిపురం, సురవరం తదితర 16 పంచాయతీలలో చెత్త నుంచి సంపద కేంద్రాలకు రెవెన్యూ అధికారులు స్థలాలు కేటాయించకపోవడంతో నిర్మాణాలు చేపట్టలేదు. వాస్తవానికి పారిశుధ్య నిర్వహణలో చెత్త సంపద కేంద్రాలు కీలకం. అయితే అందుకు విరుద్ధంగా జరుగుతోంది. నిర్వాహణ మాత్రం సక్రమంగా జరగడం లేదు. దీంతో చెత్త నుంచి సంపద సృష్టించాలన్న ప్రభుత్వ ప్రకటనలు అధికారుల నిర్లక్ష్యం వల్ల లక్ష్యం నెరవేరడంలేదు. చెత్త నుంచి సంపద కేంద్రాల వద్ద పేరుకుపోయిన చెత్త నిల్వలే ఇందుకు నిదర్శనం.

అవగాహన కల్పిస్తున్నాం..

గ్రామాల్లో తడి, పొడి చెత్తను ఇళ్ల వద్ద వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేసేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కొందరు ఇళ్లల్లో చెత్తను తీసుకొచ్చి రోడ్లపై వేస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు చెప్పాం. చెత్త సంపద కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

- కె.సురేష్‌కుమార్, ఎంపీడీవో

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

విజయనగరం క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడాలపేటలో ఓ యువతి మనస్తాపంతో సోమవారం ఆత్మహత్య చేసుకుందని రూరల్ ఎస్ఐ అశోక్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అనకాపల్లికి చెందిన ఎస్.భారతి.. రెడ్డి ల్యాబ్స్‌లో ట్రైనీగా పనిచేస్తూ విజయనగరం పడాలపేటలో అద్దెకు ఉంటోంది. ఉద్యోగం రెగ్యులర్ కాలేదని, పని ఒత్తిడి అధికంగా ఉందని మనస్తాపానికి గురైంది. ఇంట్లోని గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుందని తెలిపారు. ఆమె తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తుంటారని, సోదరుడు బీటెక్ చదువుతూ హైదరాబాదులో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడన్నారు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐటీడీఏ ఉద్యోగి మృతి

పార్వతీపురం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండిదొరవలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐటీడీఏ పార్క్‌కు చెందిన ఉద్యోగి చాటల సింహాచలం (32) మృతి చెందారు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో సింహాచలం అక్కడికక్కడే మృతి చెందాడు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆ చోరీ.. అంతర్రాష్ట్ర దొంగల పనే

కొత్తవలస, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మంగళపాలెంలో గత 28న రాత్రి జరిగిన భారీ చోరీ అంతర్రాష్ట్ర దొంగల పనేనని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. ఈ చోరీలో 90 తులాల బంగారంతో పాటు రూ.5 లక్షల నగదు చోరీకి గురైనట్టు గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రావర్తి జగదీశ్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. బాధితుడు ఫిర్యాదులో తెలిపిన దానికి మించి సొత్తు అధికంగా అపహరణకు గురికావడంతో విశాఖ రేంజ్ డీఐజీ, ఎస్పీ, అడిషనల్ ఎస్పీ రంగంలోకి దిగారు. వివిధ కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. ముందుగా స్థానికులు, ట్రస్టులో పనిచేస్తున్న కొందరిని పోలీసులు విచారించినప్పటికీ ఎలాంటి ఆధారాలు దొరకలేదు. దీంతో అంతర్రాష్ట్ర ముఠాలు చేసిన పనేనని నిర్ధారణకు వచ్చారు. ఈ తరహా నేరాలకు పాల్పడిన దొంగల ముఠాలకు సంబంధించి వివరాలను సేకరించి నేరస్థలంలో తీసిన వేలిముద్రలతో సరిపోలుస్తున్నారు. ఇప్పటికే పోలీసు బృందాలను వివిధ రాష్ట్రాలకు పంపించారు. ప్రధానంగా దొంగతనం జరగడానికి ముందు ఈ ప్రాంతంలో జరిగిన ఫోన్ కాల్స్‌పై పోలీసులు దృష్టి పెట్టారు. అంతకు ముందు రోజు ఆప్రాంతంలో జరిగిన ఫోన్ కాల్స్‌కు సంబంధించి డేటాలపై దృష్టి పెట్టినట్టు సమాచారం. ఒక పక్క వివిధ రాష్ట్రాలకు పోలీసుల బృందాలను పంపించినప్పటికీ కొంతమంది కదలికపై పోలీసులు నిఘా పెట్టారు. రెండు, మూడు రోజుల్లో నేరస్తులను పట్టుకోగలనమనే ధీమా పోలీసులు వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

- ముగ్గురికి గాయాలు
- జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స

విజయనగరం క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రింగురోడ్డు సమీపంలోని రామకృష్ణనగర్‌లో అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కన ఇంట్లోకి దూసుకెళ్లింది. దాంతో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఫోర్టుసిటీ వైపు నుంచి రామకృష్ణనగర్ వైపు వెళ్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లింది. దాంతో ఇంట్లో నిద్రిస్తున్న పట్నాన సత్యవతి, గొడ్డు వినయ్, పట్నాన మహేంద్ర గాయాలపాలయ్యారు. ఇంటి గోడలు, రేకులు కుప్పకులాయి. విషయం గ్రహించిన స్థానికులు క్షతగ్రాతులను జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. మహేంద్ర కాలికి గాయం కాగా, వినయ్‌కు చెయ్యి విరిగింది. ఘటన స్థలాన్ని టూటౌన్ పోలీసులు సందర్శించారు. ప్రమాదానికి కారకుడైన మెట్ట ప్రభాకరరావుపై కేసు నమోదు చేసి చేసినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు, శాంతమూర్తి ఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు.


ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

బండమ్మతల్లి ఆలయంలో చోరీ

శృంగవరపుకోట, జూన్2 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శివారు సీతంపేటలో గల బండమ్మతల్లి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని మూడు హుండీల్లో నగదు అపహరణకు గురైంది. 14 ఏళ్ల తర్వాత ఆదివారం అమ్మవారి పండగను నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాల్లో గ్రామస్థులు ఉండగా ఆలయంలో చోరీ జరిగింది. అమ్మవారి ఆలయం గ్రామానికి దూరంగా ఉండటంతో దొంగలకు కలిసి వచ్చినట్టయింది. అమ్మవారి పండుగ కావడంతో వారం రోజులుగా పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడులతో హుండీ నిండింది. దాంతో నిర్వాహకులు రెండు బిందెలను హుండీలుగా మార్చి భక్తులకు అందుబాటులో ఉంచారు. అందులో దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని అంచనా. అవన్నీ చోరీకి గురయ్యాయి. అందులో ఒక హుండీని ఆలయం సమీపంలో పగులగొట్టి అందులోని నగదు తీసుకుపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు విజయనగరం నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

రెండు ఇళ్లు దగ్ధం

పార్వతీపురం రూరల్, జూన్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లబురిడిలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. వై.లక్ష్మీనాయుడు, కె.శ్రీనులకు చెందిన ఇళ్లు దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. విద్యుత్ సరఫరాను యువకులు నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది.

25 లీటర్ల సారా స్వాధీనం

సీతంపేట రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోటలో నిర్వహించిన దాడుల్లో 25 లీటర్ల సారా తరలిస్తున్న ఒకరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్టు దోనుబాయి ఎస్ఐ మస్తాన్ తెలిపారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. కేసు నమోదు చేసి ముద్దాయిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

తాతారావును అభినందించిన ఒబ్బిన

శృంగవరపుకోట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) విశాఖపట్నం డీసీసీ చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన కోన తాతారావును శృంగవరపుకోట జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు అభినందించారు. జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడిగా ఉన్న తాతారావు మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు

గజపతినగరం, జూన్2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఏపీవో బి.కృష్ణవేణి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖలు అధికారులను సమన్వయం చేసుకుంటూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. మండలంలో 500 మొక్కలు నాటాలన్నదే లక్ష్యమన్నారు.

పోస్టాఫీసుకు స్థల పరిశీలన

భోగాపురం, జూన్2(ఆంధ్రజ్యోతి): భోగాపురం మండల రెవెన్యూ కార్యాలయ పరిధిలో పోస్టాఫీసుకు కేటాయించిన స్థలాన్ని జేసీ సేతు మాధవన్ సోమవారం పరిశీలించారు. స్థానికంగా అంతర్జాతీయ ఎయిర్ పోర్టు నిర్మాణం జరుగుతుండటంతో పోస్టాఫీస్ కోసం మండల రెవెన్యూ కార్యాలయం సమీపంలో 10 సెంట్ల స్థల కేటాయించారు. ఆయనతో పాటు తహసీల్దారు ఎం.సురేష్, సర్వేయర్ మధుకేశవరావు, సబ్ పోస్ట్‌మాస్టర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోర్టు తీర్పు అమలు చేయండి

నెల్లిమర్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు నెల్లిమర్ల జూట్ మిల్లు రిటైర్డు కార్మికులకు గ్రాట్యుటీ చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు మైపాడ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు బి.సుదర్శనరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మొయిద పాపారావు, కిల్లంపల్లి రామారావు, బీజేపీ నాయకుడు సురాల సూర్యనారాయణ పాల్గొన్నారు.

సత్యనారాయణమూర్తి కుటుంబానికి పరామర్శ

గుర్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గరికివలస గ్రామానికి చెందిన బీజేపీ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి సత్యనారాయణమూర్తి కుటుంబాన్ని రాష్ట్ర బీజేపీ మహిళా నేతలు సోమవారం పరామర్శించారు. రాష్ట్ర మహిళా మోర్చ కార్యదర్శి డాక్టర్ పాకా నాగమల్లికను ఓదార్చారు. రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షులు బొల్లినా నిర్మల, ఉపాధ్యక్షురాలు వి.రోహిణి, కార్యదర్శి ఎ.బేబీరాణి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

వేపాడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాకేరులో గుండాలమ్మ, పైడమ్మ, శ్రీకృష్ణస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను రెండురోజుల పాటు ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు బుద్ధ అప్పలనాయుడు దంపతులు, ఎంపీటీసీ సభ్యుడు టి.వెంకటరమణ, సలాది సూరిబాబు, సాయిపల్లి పైడినాయుడు తదితరుల ఆధ్వ ర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమా నికి చినకండేపల్లి దరి సాయిపల్లె నుంచి సత్యసాయిస్వామి హజరయ్యారు. కార్యక్రమంలో నన్నయ్య వర్సిటీ విశ్రాంత వీసీ ముర్రు ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ పారామెడికల్ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ పారామెడికల్ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థులు సత్తా చాటారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాల్లో మొదటి సంవత్సరం నుంచి యు.వాగ్దేవి(540) రెండో ర్యాంకు సాధించింది. అనస్థీషియా విభాగం నుంచి బి.బిందు 4వ ర్యాంకు, యశ్వంత్ 6వ ర్యాంకు సాధించారు. ఆప్టోమెట్రీ విభాగం నుంచి సీపాన సునీత 2వ ర్యాంకు, బరాటం భార్గవి 5వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. రేడియాలజీ విభాగం నుంచి షణ్ముఖశ్రీ 4వ ర్యాంకు, న్యూరో ఫిజియాలజీ టెక్నాలజీ నుంచి ప్రసన్న 3వ ర్యాంకు సాధించి యూనివర్సిటీ టాప్ ర్యాంకర్‌గా నిలిచారు. రెండో సంవత్సరం విద్యార్థుల్లో డి.ప్రవల్లిక 4వ ర్యాంకు, జి.ఉర్జిత 2వ ర్యాంకు, సాయి అభిషేక్ 4వ ర్యాంక్‌లతో యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచారు. ఈ మేరకు డా. బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీపద్మజ, సిబ్బంది పాల్గొన్నారు. ప్రస్తుతం బీఎస్సీ పారామెడికల్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. వివరాల కోసం 7680945357, 7995013422 నంబర్లను లేదా జెమ్స్ ఆసుపత్రిలో తమ సంస్థను సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం అభినందనీయం

విజయనగరం దాసన్నపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు జిల్లాలో శిష్టకరణ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేయడం అభినందనీయమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ నెల 16న నగరంలోని కె.ఎల్.పురంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి హాజరు కావాలని ఎంపీ కలిశెట్టిని సంఘ ప్రతినిధులు కోరారు. సోమవారం ఎంపీని ఆయన నివాసంలో సంఘ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంపీజీ గౌరీశంకర్, రేగా సురేష్ మాట్లాడుతూ ఈ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వాడ్రంగి వెంకటేష్, మధుసూదనరావు, వరప్రసాద్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఎంపీని ఆహ్వానిస్తున్న శిష్టకరణ ప్రతినిధులు

కార్యకర్తలకు అండగా జనసేన

రాజాం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ మరణించిన క్రియాశీలక కార్యకర్తలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని, వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు స్పష్టం చేశారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల మృతి చెందిన రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగులివలస గ్రామానికి చెందిన కెంబూరు వైకుంఠరావు తల్లి కళావతి, భార్య రాధకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు రూ.5 లక్షల చెక్కును అందజేశారని సురేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో రాజాం నియోజకవర్గ జనసేన నాయకులు గార ఎర్రంనాయుడు, శెట్టి ఆదినాయుడు, లెంక అన్నంనాయుడు, మీసాల శ్రావణ్‌కుమార్, పొగిరి శివ, వారాడ కిశోర్ తదతరులు పాల్గొన్నారని సురేష్‌బాబు తెలిపారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

పీజీఆర్ఎస్‌కు 32 ఫిర్యాదులు

విజయనగరం క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఎస్పీ వకుల్ జిందాల్ 32 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని వాటి పూర్వాపరాలను విచారణ చేసి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యలను వారంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, డీసీఆర్‌బీ సీఐ సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ

కుదిరిన ఒప్పందం

కొత్తవలస, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలోని వివిధ వాణిజ్యసముదాయాల వద్ద పనిచేస్తున్న ముఠా కార్మికులకు కొత్తవలస వర్తక సంఘానికి మధ్య సోమవారం జరిగిన చర్చలు సఫలమయ్యాయి. ముఠా కార్మిక సంఘం తరఫున సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ హాజరయ్యారు. రెండేళ్లకు గాను వ్యాపారులు ముఠా కార్మికులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పుడు ఇస్తున్న కూలీ రేట్లపై 30 శాతం పెంచడానికి వ్యాపారులు అంగీకరించారు. ముఠా కార్మిక సంఘం తరఫున నాయకులు గాడి అప్పారావు, గొంపకృష్ణ మూర్తి, వ్యాపార సంఘం తరఫున మురర్కారి తాత, విన్నకోట గౌతం, కొండబాబు, కొల్లా సత్యనారాయణ, విజయ్, ముఠా కార్మిక సంఘం నాయకులు దావాల మహేశ్ పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

బొండపల్లి, జూన్2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి బొబ్బిలి నుంచి నెల్లూరు సూళ్లూరుపేటకు అక్రమంగా తరలిస్తున్న 32 పశువులను పోలీసులు పట్టుకున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా ఒక లారీని తనిఖీ చేశారు. 32 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. లారీని సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. బొండపల్లి పశువైద్యాధికారి ఎం.కిరణ్‌కుమార్ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి కొత్తవలసలోని గోశాలకు తరలించారు.


స్వాధీనం చేసుకున్న పశువులు

ఘనంగా జెండా ఆవిష్కరణ

గుర్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబంటుపల్లిలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబంటుపల్లి జంక్షన్ నుంచి పార్టీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రెల్లి పైడిరాజును జనసేన నాయకులు అభినందించారు. కార్యక్రమంలో భాగంగా నియో జకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరాయి. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ కోట్ల కృష్ణ, రమేష్‌రాజు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

అందరికి అందుబాటులో ఉంటా..

బొండపల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కుటుంబంలో అందరికీ అందుబాటులో ఉండేందుకు మండల పార్టీ కార్యాలయం ప్రారంభించినట్టు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం బొండపల్లి ప్రభుత్వ కార్యాలయ సముదాయాల పక్కన మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని నాయకులు, కార్యకర్తల సమక్షంలోప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారం, కార్యకర్తల సమన్వయకల్పన, క్షేత్రస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పార్టీ అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నేటి నుంచి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పీవీవీ గోపాలరాజు, కోరాడ కృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు రాపాక అచ్చెన్నాయుడు, సర్పంచ్‌లు నంబూరి రాజేష్, కర్రోతు శ్రీనివాసరావు, నడుపూరి భాస్కరరావు, ఈదుబిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

● దత్తిరాజేరు, జూన్2(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.బూర్జవలసలో దుర్గాదేవి ఆలయంలో సోమవారం నిర్వహించిన నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠోత్సవంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ ధర్మకర్త బెజవాడ రామునాయుడు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులు

రాజాం/రేగిడి, జూన్2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో నియోజకవర్గంలోని పలువురు విద్యార్థులు సత్తా చాటారు. రేగిడి మండలంలోని అంబఖండి గ్రామానికి చెందిన నడిపిల్లి దినకర్ ప్రశాంత్ ఆల్ ఇండియా స్థాయిలో 2402 ర్యాంకు, ఓబీసీ ఎన్‌సీఎల్‌లో 428 ర్యాంకు సాధించాడు. ప్రశాంత్ తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులు. అలాగే తునివాడకు చెందిన పిల్లా శాంతిప్రియ ఆలిండియా స్థాయిలో 3902 ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 737వ ర్యాంకు సాధించింది. విద్యార్థిని తండ్రి వెంకటరమణ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. మురపాక శ్రీనిధి ఆల్ ఇండియా స్థాయిలో 11011 ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 2561వ ర్యాంకు సాధించింది.


దినకర్


శాంతిప్రియ


శ్రీనిధి

వాటర్‌ప్లాంట్‌పై ఫిర్యాదు

జామి, జూన్2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగరంలో పంచాయతీ తీర్మానం లేకుండా వాటర్ ప్లాంట్ ఏర్పాటైందని సర్పంచ్ వసి పార్వతి అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వంలో కొంతమంది పెద్దల అండదండలతో ప్లాంట్ ఏర్పాటైందన్నారు. ఈ విషయంపై పంచాయతీ, మండల అధికారులను ప్రశ్నించినా సమాధానం లేదన్నారు. ప్లాంట్ వల్ల పంచాయతీకి పైసా ఆదాయం సమకూరడం లేదన్నారు. పైగా వాటర్ ప్లాంట్ ఏర్పాటుతో గ్రామంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయన్నారు. ఇదే విషయం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎస్సీ కాలనీకి చెందిన వసి రాముతో ఫిర్యాదు చేయించానని సర్పంచ్ తెలిపారు.


మాట్లాడుతున్న సర్పంచ్ పార్వతి

గంజాయితో ఆరుగురి అరెస్టు

డెంకాడ, జూన్2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్లాం గ్రామం సమీపంలో ఆరుగురు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. భాష్యం లేఅవుట్‌లో కొంతమంది వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో యాంటీ గంజాయి టీం సోమవారం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో ఒక జువైనల్‌తో పాటు ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 1.330 కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, రూ.200 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో జామి మండలం అలమండ గ్రామానికి చెందిన దాసరి గాంధీ గంజాయిని విక్రయిస్తున్నట్టు విచారణలో వెల్లడైందన్నారు. అలాగే డెంకాడ మండలం బెల్లాం గ్రామానికి చెందిన జుతికి శ్యామ్, మల్లాపురెడ్డి రాకేష్, దిబ్బగుడ్డి గ్రామానికి చెందిన మల్లాపురెడ్డి వేణుతో పాటు ఓ జువైనల్ గంజాయి సేవిస్తున్నట్టు విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు.

రామానాయుడు రోడ్డులో ఇద్దరు..

● విజయనగరం క్రైం, జూన్2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామానాయుడు రోడ్డులో సోమవారం రాత్రి గంజాయితో ఇద్దరు వ్యక్తులను వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ అరెస్టు చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ఆయన దాడి చేసి గంజాయి సేవించడంతో పాటు విక్రయాలకు పాల్పడుతున్న ఉడా కాలనీకి చెందిన వజ్జల భరత్ కుమార్, లంక పట్నానికి చెందిన చిన్న మనోహర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి 375 గ్రాముల గంజాయి, రూ.350 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

భోగాపురం, జూన్2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడలో తోగాలమ్మ ఆలయంలో చోరీకి పాల్పడిన విశాఖ జిల్లా భీమిలి మండలం చిప్పాడకు చెందిన సరగడ భాస్కరరెడ్డిని సోమవారం భోగాపురం పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 28న అర్ధరాత్రి సమయంలో తోగాలమ్మ గుడిలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. స్థానికుల ఫిర్యాదు మేరకు భాస్కరరెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ

విజయనగరం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం కటక్‌లో గత నెల 30 నుంచి జూన్ 1 వరకూ నిర్వహించిన ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం కస్పా క్లబ్ 8 పతకాలు కైవసం చేసుకుంది. ఈ పోటీలు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగాయి. టౌన్ కస్పా హైస్కూల్ గ్రౌండ్‌లో శిక్షణ పొందుతున్న ఎనిమిది మంది తైక్వాండో క్రీడాకారులకు రెండు బంగారు పతకాలు, ఒక సిల్వర్ పతకం, ఐదు కాంస్య పతకాలు లభించాయి. ఈ సందర్భంగా డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, సంఘ సభ్యులు పిల్లా శ్రీనివాస్, ఎస్.సతీష్‌కుమార్, మురళీకృష్ణ, వెంకటేష్ విజేతలను అభినందించారు.


పతకాలు సాధించిన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

నిధులు మంజూరైనా.. నిర్మాణానికి నోచుకోక

● వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల వెనక్కి వెళ్లిపోయిన వైనం ● కలగా మక్కువలో ప్రధాన రోడ్డు నిర్మాణం

మక్కువ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సాలూరు నుంచి సువర్ణముఖి నది వంతెన వరకు రహదారి నిర్మాణానికి రూ.56 కోట్లు మంజూరైనా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో మక్కువలో ప్రధాన రహదారి నిర్మాణం కలగానే మిగిలింది.

మక్కువలోని మజ్జి గౌరమ్మ ఆలయం నుంచి సువర్ణముఖి నది వంతెన వరకు ప్రధాన రహదారి పూర్తి శిథిలావస్థకు చేరుకుంది.ఈనేపథ్యంలో సాలూరు నుంచి సువర్ణముఖి నది వంతెన వరకు రహదారి నిర్మాణానికి రూ.56 కోట్లు మంజూరైనా వెనక్కి వెళ్లిపోవడంతో మక్కువలో ప్రధాన రోడ్డు నిర్మాణం కలగానే మిగిలింది. మక్కువ మీదుగా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు.ప్రధానరహదారి గోతుల మయంగా మారడంతోపాటు నిత్యంరహదారిపై దుమ్ము ఎగురుతుండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఏపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్డుపైకి ప్రవహించి దుర్గంధభరితంగా మారుతోందని వాహనచోదకులు వాపోతున్నారు. ఏటా సంబర జాతర సమయంలో చినబోగిలి,బొబ్బిలి, సాలూరునుంచి మక్కువ మీదుగా రోడ్లకు మరమ్మతులుచేస్తున్నారే తప్పా పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం టీడీపీ హయాంలో ఈ రోడ్డు పనులు ప్రారంభమవుతాయని పలువురు ఎదురుచూస్తున్నారు. కాగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదేశాల మేరకు మక్కువ ప్రధాన రహదారి సమస్యపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపామని ఆర్‌అండ్‌బీ జేఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదేశాలొచ్చిన వెంటనే నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపడతామని చెప్పారు.


మక్కువ వద్ద రాళ్లు తేలిన రోడ్డు

అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి


డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నాయకులు

పాలకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ సాలూరు డిపో ఎన్ఎంయూ కార్యదర్శి సీహెచ్ శేఖర్ అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని పాలకొండ డిపో ఎన్ఎంయూ అధ్యక్ష కార్యదర్శులు వావిలపల్లి రాజేష్, ఎస్‌టీ రావు కోరారు. సోమవారం పాలకొండ డిపో ఎదుట ఎన్ఎంయూ సభ్యులు నిరసన తెలిపారు.కార్యక్రమంలో మన్యం జిల్లా ఉపాధ్యక్షుడు పీఎల్‌రావు, ఎన్ఎంయూ నాయకులు బీసీ నాయుడు, కేవీ ప్రసాద్, యూవీ లక్ష్మి, ఎంవీ నాయుడు పాల్గొన్నారు.

సమరయోధుల జీవిత చరిత్రపై అవగాహన


సమరయోధుల జీవిత చరిత్రను వివరిస్తున్న దృశ్యం

పాలకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పాలకొండ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు గొన్నాబత్తుల దుర్గారావు విద్యార్థులకు స్వాతంత్ర్యసమర యోధుల జీవితచరిత్రపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు మాట్లాడుతూ మంగళవారం స్వర్ణాంధ్ర అన్న అంశంపై చి త్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

యోగాపై అవగాహన కల్పించాలి

గరుగుబిల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో యోగాపై ప్రత్యేక అవగాహన కల్పించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. సోమవారం గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కొమరాడ ఐసీడీఎస్ సీడీపీవో జి.సుగుణకుమారి, సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మితో పాటు మండల వెలుగు సిబ్బంది సీహెచ్ తిరుపతిరావు, బి.రామినాయుడు పాల్గొన్నారు.

●వీరఘట్టం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం యోగాంధ్ర రంగోలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని కేంద్రాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు ముగ్గులు వేశారు. కార్యక్రమంలో ఏవో దూబ వెంకటరమణ, ఏపీవో జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

●బలిజిపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం యోగాంధ్రలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రంగవల్లికల పోటీలు నిర్వహించారు.అనంతరం ముగ్గులు వేసిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్, ఐసీడీఎస్‌పీవో సులేఖ, వైద్యాధికారి కిరణ్మయి,ఎంపీడీవో నగేష్ పాల్గొన్నారు.

పనుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

గరుగుబిల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం పనులు నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి హెచ్చరించారు. సోమవారం గరుగుబిల్లి, పెద్దూరుల్లో నిర్వహిస్తున్న ఫాంపాండ్ల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, టెక్నికల్ అసిస్టెంట్ సీహెచ్ రుద్రకోటేశ్వరరావు, క్షేత్ర సహాయకులు అరుణ పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుతో లాభాలు

బలిజిపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి):నీటి సదుపాయమున్న మెట్ట భూముల్లో ఆయిల్‌ఫామ్ సాగుచేసుకుంటే అధిక లాభాలు ఆర్జించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్త విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని బర్లి, వంతరాం, గంగాడ గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శాస్త్రవేత్తలు బృందం సభ్యులు పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా బర్లిలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు సంప్రదాయేతర వాణిజ్య పంటలపై మొగ్గు చూపాలన్నారు.ఆయిల్‌ఫామ్ సాగుకు ప్రభుత్వం 50 శాతం రాయితీ మంజూరు చేస్తోందని తెలిపారు. శాస్త్రవేత్త బిందు మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షల ద్వారా భూసారాన్ని తెలుసుకొని ఎరువుల వినియోగంలో ఖర్చును నియంత్రించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, తేజేశ్వరరావు, ఎంవీ శ్రీనివాస్, డీఆర్పీ సహాయ సంచాలకులు ఆర్.శ్రీనివాస్, పార్వతీపురం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు టి.వెంకటేష్, ఉద్యానవనశాఖ అధికారి ప్రత్యూష, ఏవో ఎం.శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కార్డులు అందించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

సీతానగరం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులందరికీ వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మంనాయుడులు డిమాండ్ చేశారు. సోమవారం సీతానగరం తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు రైతు సంఘం జిల్లా నాయకులు అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఈశ్వరరావు, రైతు సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం కౌలు రైతులకు నిబంధనలు పెట్టి ఇప్పటికీ గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ రూ. 20 వేలు చెల్లించాలన్నారు.

గుర్తింపు కార్డులకు నమోదు చేసుకోవాలి

వీరఘట్టం, జూన్ 2(ఆంధ్రజ్యోతి):కౌలు రైతులు కొత్తగా గుర్తింపు కార్డులకు నమోదుచేసుకోవాలని ఏవో సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం, భూమి యజమాని ఆధార్‌కార్డు, కౌలు రైతు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకొని సచివాలయం వద్ద గ్రామ వీఆర్వోను కలిసి నమోదు చేసుకోవాని కోరారు. మండలానికి 500 నవధాన్యాల కిట్లు వచ్చాయని, 50 శాతం సబ్సిడీ పోను రైతు 648 రూపాయలు చెల్లించాలని తెలిపారు. విత్తనాలకోసం ఈనెల ఏడో తేదీలోగా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

● రాయగడ జిల్లా కలెక్టర్ పారుల్ పట్వారి

రాయగడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):పలుసమస్యలపై ప్రజలు అందజేసిన వినతులను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను రాయగడ జిల్లా కలెక్టర్ పారుల్ పట్వారి ఆదేశించారు. రాయగడ జిల్లా పరిషత్ సద్భావన హాలులో కలెక్టర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 55మంది సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వీటిని పరిశీలించిన కలెక్టర్ 11 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.లక్షా 18 వేలు అందజేశారు. తాగునీరు, గృహ నిర్మాణాలు, రహదారులు, విద్యుత్, అంగనవాడీ కేంద్రం ఏర్పాటుపై ఎక్కువ వినతులు అందాయి. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, జిల్లా పరిషత్ కార్యనిర్వాహణాధికారి అక్షయ్‌కుమార్ ఖెముండు, డిప్యూటీ కలెక్టర్ రణేష్‌కుమార్ జెన్నా, జిల్లా కేంద్రాసుపత్రి ముఖ్య వైద్యాధికారి ప్రఫుల్లకుమార్ పాడి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి రూ.లక్ష మంజూరు

● మినీ కేంద్రాలు ఇక మెయిన్ సెంటర్లు: మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలన్ని మెయిన్ సెంటర్లగా త్వరలో మారనున్నట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లల ఆట, ఇతర వస్తువుల కొనుగోళ్లకు ఒక్కో కేంద్రానికి లక్ష రూపాయల చొప్పున త్వరలో మంజూరుకానున్నాయని చెప్పారు. సోమవారం సాలూరు యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో పాలపొడి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైదాన ప్రాంతాల నుంచి గిరిశిఖర ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పాలను తరలిస్తే అవి పాడైపోయి శిశువులు, తల్లులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందని భావించి రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా సాలూరు, పాచిపెంట, రంపచోడవరం, అనంతగిరి ఆదివాసీ ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టుగా పాలపొడి పంపిణీ ప్రారంభించనున్న ట్లు తెలిపారు. కేంద్రాల్లో గ్యాస్‌స్టవ్ సమస్య వస్తే తక్షణమే పిల్లలకు ఆహారం వండి పెట్టేందుకు ఇండెక్షన్ స్టవ్‌లను పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.అంగన్‌వాడీ వ్యవస్థలో లీడర్లు ఉండకూదని, సీడీపీవో,సూపర్‌వైజర్ల ద్వారా మాత్రమే వ్యవస్థ కొనసాగాలని ఆమె సూచించారు.సాధారణ ప్రసవాల్లో మన్యం జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. కొండలపై ఉన్న గ్రామాల్లో ఉన్న గర్భిణులకు ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, వైద్యసిబ్బంది తెలియజేసి వారిని వసతిగృహంలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారి కనకదుర్గా, సాలూరు పట్టణ పీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు అనూరాధ, లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంధ్యారాణి

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

సాలూరులో నిర్వహించిన కార్యక్రమంలో ముగ్గురు రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 49, 136ల చెక్కులను లబ్ధిదారులకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అందజేశారు. సాలూరు మునిసిపాలిటీలోని 22వ వార్డులోగల బోనం శారదకు రూ.లక్షా 49వేల 136లు, సాలూరు మండలంలోని తోణాం గ్రామానికి చెందిన వారణాశి గోవిందరావుకు రూ.75వేలు, మెంటాడ మండలం లక్ష్మీపురానికి చెందిన కందివలస శ్రీనుకు రూ.70వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీచేశారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ద్రాక్షిణి గ్రామస్థులు

గుమ్మలక్ష్మీపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కొండచిలకం జంక్షన్ నుంచి ద్రాక్షిణి వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని జియ్యమ్మవలస మండలంలోని ద్రాక్షిణి గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం గుమ్మలక్ష్మీపురంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వినతిపత్రం అందించారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకుగురవుతున్నామని తెలిపారు. సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

కరుపాం,జూన్2 (ఆంధ్రజ్యోతి)మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు నాణ్యమైన భోజనం అందజేయాలని మండల విద్యాశాఖాధికారి రాధాకృష్ణమూర్తి కోరారు. సోమవారం కురుపాంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తోందని, నిర్వాహకులు నాణ్యతతో కూడిన వంటకాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం టి.శంకరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

సాలూరు రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న గిరిజన కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు మర్రి శ్రీనివాసరావు డిమాండ్‌చేశారు. సోమవారం కొఠియా గ్రూప్ పరిధిలో గల ఎగువశెంబి వద్ద పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలి రోజుకు రూ.600, పని దినాలు 200 కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మికసంఘ నాయకులు కుంబులు, సన్నం, జాంబ్రి పాల్గొన్నారు.

భూకబ్జాపై ఫిర్యాదు

పాచిపెంట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరివలసలో గ్రామ కంఠం కబ్జాపై చర్యలు తీసుకోవాలని కేసలి సర్పంచ్ సత్తారపు నిర్మల కోరారు. ఈ మేరకుసోమవారం పాచిపెంట తహసీల్దార్ డి.రవికి ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గిరిజనులను మోసం చేసి గ్రామకంఠం కబ్జా చేయడం సబబు కాదన్నారు. తక్షణమే క్షేత్ర స్థాయిలో పరిశీలించి కబ్జా చేసిన గ్రామ కంఠం స్వాధీనం చేసుకోవాలని కుమ్మరి వలసకు చెందిన గిరిజనులు డి.సింహాచలం, కె.త్రినాథ, జె.గౌరీష్, ఎస్.దుర్గారావు కోరారు

బాధితులకు న్యాయం చేయాలి

● ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం/బెలగాం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 63 ఫిర్యాదులు అందాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం లేకుండా నిర్దిష్ట గడువులోపు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో జేసీ ఎస్.ఎస్.శోభిక, డీఆర్వో కె.హేమలత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా రెండు కాళ్లు, చేతులు పని చేయవని, 100శాతం దివ్యాంగురాలైన తనకు పింఛన్ మంజూరు చేయాలని గరుగుబిల్లిమండలంలో పెదగొడబకుచెందిన కె.భాగ్యలక్ష్మి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది.

తోటపల్లి ఎడమకాలువ నుంచి సాగునీరందించాలి

బెలగాం/పాలకొండ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పాలకొండ మండలంలోని ఆయకట్టుకు తోటపల్లి ఎడమ కాలువ నుంచి సాగునీరందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు.సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి, కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ పాలకొండ, వీరఘట్టం, జియ్యమ్మవలస మండలాల ఆయకట్టు రైతులకు 12 ఏళ్ల నుంచి సాగునీరందడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆయా సంఘం నాయకులు బంటు దాసు, రైతులు పాల్గొన్నారు.


పార్వతీపురం/బెలగాం:ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

బలిజిపేట-పార్వతీపురం బస్సు నడపాలి

బలిజిపేట, జూన్2(ఆంధ్రజ్యోతి):బలిజిపేట నుంచి పార్వతీపురం వరకు పెద్దింపేట మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు ఆ పార్టీ నాయకులు రెడ్డివేణు, మండల కార్యదరిశ వై.మన్మథరావు, రామారావు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నారాయణపురం వద్ద సువర్ణముఖి నదిపై వంతెన పూర్తికావడంతో ఆర్టీసీ సర్వీసులను పార్వతీపురం నుంచి బలిజిపేట వరకు నడపాలని విన్నవించారు. నారాయణపురంలో బైపాస్‌రోడ్డు పనులు చేపట్టాలని కోరారు.

పీజీఆర్ఎస్‌కు 32 వినతులు


గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) 32వినతులు అందాయి. కార్య క్రమంలో ఏపీవో జి. చిన్నబాబు, డీడీ అన్నదొర, టీడబ్ల్యూ ఈఈ పి.రమాదేవి, పీహెచ్‌వో ఆర్‌వీ గణేష్, వెలుగు, ఉపాధి ఏపీడీలు శ్రీహరి, సన్యాసిరావు, ఏటీడబ్ల్యూవో మంగవేణి, సీడీపీవో రంగలక్ష్మి పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

పార్వతీపురంటౌన్/బెలగాం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే పరిష్కరించేలా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని ఏఎస్పీ అంకిత సురాన కోరారు. సోమవారం పార్వతీపురంలోని ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా నాలుగు ఫిర్యాదు అందాయి. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారులు అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలే చర్యలు తీసుకోవాలని, ఆయా పోలీసు స్టేషన్ల అధికారులకు కోరారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదామ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఏఎస్పీ అంకితా సురాన

తోటపల్లి ఆలయ సమస్యలపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలోని ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలని ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం పలు సమస్యలను ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట అభివృద్ధి సేవా ట్రస్ట్ సభ్యులు శ్రీరామచంద్రమూర్తి, ఎం.ప్రకాష్, టి.దుర్గారావు, సత్యం ఉన్నారు.

జేఈఈలో మెరిశారు

(ఒకటో పేజీ తరువాయి)

చేయడమే తన లక్ష్యమని ఆ విద్యార్థి తెలిపాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ ఫలితాలు సాధించగలిగానని వెల్లడించాడు.



సత్తాచాటిన బలరాంనాయుడు

పార్వతీపురం టౌన్: పట్టణానికి చెందిన ద్వారపురెడ్డి బలరాంనాయుడు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 633వ ర్యాంకు సాధించాడు. పట్టణంలోని కర్షమహర్షి ఆసుపత్రి వీధికి చెందిన బలరాంనాయుడు గుడివాడలో టెన్త్ పూర్తి చేశాడు. విజయవాడలో ఇంటర్ విద్యనభ్యసించాడు. బలరాంనాయుడు ఉత్తమ ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు డాక్టర్ ద్వారపురెడ్డి శంకుతల, తిరుపతిరావు ఆనందం వ్యక్తం చేశారు.

నిధులు మంజూరై ఏడాది.. నిర్మాణమెప్పుడో మరి!

(ఒకటో పేజీ తరువాయి)

నాయకులు అభ్యంతరం తెలిపారు. ప్రజాధనం వృథా కాకుండా ఈ భవన నిర్మాణంపై ముందుగానే సమాలో చనలు చేయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నీటిపారుదలశాఖ అధికారులు తొందర పాటు నిర్ణయాలు తీసుకోకుండా విశాల ప్రదేశంలో భవన నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నోటీసు ఇచ్చాం

ఏడాది గడుస్తున్నా వెలగవాడ సమీపంలో భవన నిర్మాణ పనులు ప్రారంభించని కాంట్రాక్టర్ కు నోటీసులు ఇచ్చాం. ఆయన నుంచి వచ్చే సమాధానం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

-గనిరాజు, డీఈఈ

గాడితప్పిన పారిశుధ్య నిర్వహణ

వీరఘట్టం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలుపం చాయతీల్లో పారిశుధ్యనిర్వహణ గాడితప్పింది.కొద్దిరోజులుగా కురుస్తున్నవర్షాలకు మురుగుకాలువల్లో నీరు నిల్వఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. 34 పంచాయతీలుగాను చలివేంద్రి,అడారు,సంతనరిసిపురం తదితరపంచాయతీల్లో నిత్యం వీధుల్లోకి మురుగుచేరుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా పంచా యతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు అంతంతమాత్రంగా జరుగుతున్నాయని విమర్శలొస్తున్నా యి. వర్షాకాలం కావడంతో ప్రతిరోజూ మురుగునీటి కాలువలు శుభ్రపరిచి, ఫాంగింగ్ చేస్తే దోమల బెడదనివారిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని పలువురు చెబుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పకడ్బందీగా పారిశుధ్య పనులు నిర్వహించేందుకు చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


అదారులో వీధిలో ప్రవహిస్తున్న మురుగునీరు

మరుగుదొడ్లు లేవు.. తాగు నీరు లేదు

● ఇదీ వీరఘట్టం ఎంఈవో కార్యాలయం వద్ద పరిస్థితి

వీరఘట్టం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ఎంఈవో కార్యాలయంలో సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రధానంగా మరుగుదొడ్లు లేకపోవడంతో కార్యాలయానికి పనులకోసం వచ్చే ఉపాధ్యాయులు అవస్థలకు గురవుతున్నారు. కనీసం తాగునీటిసదుపాయం కూడా కల్పించలేదని పలువురు వాపోతున్నారు. కార్యాలయం ఆవరణలో ఉన్నబోరుబావి కూడాపాడైంది. నెలలు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో తాగునీటికి అవస్థలు తప్పడంలేదు. మరుగుదొడ్లు లేకపోవడంతో కార్యాలయానికి వచ్చే వారు కూడా ఆరుబయటకు లేకపోతే చుట్టుపక్కల నివసించే వారి ఇళ్లకు వెళ్లాల్సివస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలవిద్యాశాఖ కార్యాలయం ఆవరణలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని, బోరు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.


మూలకుచేరిన బోరు బావి